# బ్లాంక్ పేపరు

టంగ్, టంగ్, టంగ్, విశ్వం ఖంగారుపడ్డాడు గంటలువిని. ఎదురుగుండా ప్రశ్నపత్రం, తను వ్రాయవలసిన ఆన్సరు పుస్తకము వున్నాయి. "అబ్బా! అప్పుడే రెండు గంటలైందీ!" అనుకున్నాడు. విశ్వం కళ్లు యెర్రగా వున్నాయి. తెల్లవార్లు నిద్రలేకుండా చదివేడు, కాని, యింతవరకు ఒక్క అక్షరమైనా వ్రాయలేదు. ఇచ్చిన ప్రశ్నలకు యిందాకటినుండి సమాధానం ఆలోచిస్తున్నాడు. కాని, తండ్రి సుబ్రహ్మణ్యం మరణశయ్యమీద చినిగిన గుడ్డలూ, పాలిపోయిన ముఖమూ, మాసిన గడ్డమూ కండ్లకు గోచరిస్తున్నాయి.

* * * *

సుబ్రహ్మణ్యం మిడిల్‌స్కూలు మేష్టరు. స్కూల్లో ఇంక్రిమెంట్లు సరిగా యివ్వని అధికారి ఒక పుణ్యాజనుడు. పిత్రార్జిత మేమీ లేదు. రెక్కలే ఆధారం. అతనికి ఒక్కగానొక్క కొడుకు విశ్వం. సుబ్రహ్మణ్యం పెద్ద చదువు చదవలేక పోయాడు. అందుచేత తన కొడుకుని ఎం. ఎ. ప్యాసు చేయించాలి ఎంత కష్టపడైనాసరే అనుకున్నాడు. పిల్లవాడికి అయిదోసంవత్సరం రాగానే అక్షరాభ్యాసం చేసి అయిదు క్లాసుల వరకు తనే యింటివద్ద చెప్పి ఆ పైక్లాసులో వేయించాడు స్కూల్లో.

ఇదివరకు సుబ్రహ్మణ్యం జీతంతో అతనూ, భార్య, కొడుకు యెలాగో కాలక్షేపం చేయగలిగేవారు. విశ్వం హైస్కూలు చదువైపోయింది. కాలేజీలో ఇంటర్ మీడియేట్ చదువుతున్నాడు. సొమ్ములేక ఆఖరుటర్ము జీతం కట్టకపోవడంవల్ల పేరుకొట్టి వేసే పర్యంతం అయింది. సుబ్రహ్మణ్యం అడగరాని వాళ్లనడిగి, పట్టరానివాళ్ళ కాళ్ళు పట్టుకుని బదులు తెచ్చి కట్టడం జరిగి నిండా నెలకాలేదు. ఆ బాకీ యింకా తీర్చలేదు. ఇంతలో పులిమీద పుట్రలాగ పరీక్ష దరఖాస్తు ఒకటి వచ్చిపడింది. ఏమీ తోచలేదు. చివరికి తన భార్యమెడలో వున్న ఒక్క పుస్తెల సానూ ఆమెని పసుపుఖొందు కట్టుకోమని చెప్పి తాకట్టు పెట్టాడు. ఆ సొమ్ము తెచ్చి దరఖాస్తుకట్టి మిగిలినది అప్పుతీర్చాడు సుబ్రహ్మణ్యం.

విశ్వం ప్యాసయాడు. బి. ఎ. లో ప్రవేశించాడు. ఇదివరకు సుబ్రహ్మణ్యం వుదయం సాయంత్రం పర్మిషన్‌తో రెండూ, చాటుగా నాలుగూ ప్రైవేట్లు చెప్పుకునేవాడు. తనూ, భార్య ఒక్కపూట తిని కొడుక్కి కడుపునిండా పెట్టి కాలక్షేపం చేస్తున్నాగాని ఆ విధంగా కూడా గడవడం కష్టంగావుంది. ఒక షావుకారుదగ్గిరికి వెళ్ళి రోజూ సాయంత్రం ఆరుగంటలకు షాపులోని యేరోజు పద్దులు ఆరోజు వ్రాసి పెట్టడానికి ఒప్పుకున్నాడు. ఆ పద్దులు వ్రాసి వచ్చేటప్పటికి రోజూ రాత్రి పదిగంటలయేది. ఇదివర కెప్పుడైనా నడవలేకపోతే రిక్షా యెక్కేవాడు. ఇప్పుడెంత బాధగావున్నా, దూరమైనా నడకే శరణ్యం. పగల్లా పాఠాలు చెప్పి చెప్పి వచ్చిన సుబ్రహ్మణ్యానికి కడుపునిండా తిండిలేదు. కాని, యీ కష్టమేమీ సుబ్రహ్మణ్యానికి కనబడడంలేదు. అతని దృష్టి అంతా విశ్వం చదువుమీద కేంద్రీకరింప బడివుంది. ఒక్క రెండున్నర సంవత్సరాలు కష్టపడితే కొడుకు ఎం. ఎ. ప్యాసైపోతాడు. తన కష్టాలు గట్టెక్కుతాయి. ఇలా అనుకుంటూ తృప్తిపడేవాడు. సుబ్రహ్మణ్యం మనస్సెంతో తేలిక పడ్డటనిపించే దలాంటప్పుడు.

తిండి పుష్టిలేక సుబ్రహ్మణ్యం వెనకటి ఆరోగ్యం కోల్పోతున్నాడు. మనిషి నీరసించాడు. గుండె లార్చుకుపోతున్నాయి. కొద్దిగా దగ్గు. దగ్గేకదా అదే పోతుందనుకున్నాడు. ఆ దగ్గు క్రమంగా యెక్కువై జ్వరంకూడా వస్తోంది. విశ్వం "నాన్నగారూ, నేను చదువుమానేసి ఏదైనా వుద్యోగం సంపాదిస్తాను. మీరు కష్టపడలేరింక. మన యిబ్బంది తీరుతుంది. ప్రైవేటుగా ఒకొక్కటే కట్టి పరీక్ష ప్యాసవుతాను" అని అన్నాడు. అనేక విధాల బ్రతిమలాడాడు. ఊహు ససేమిరా ఒప్పుకోలేదు సుబ్రహ్మణ్యం. ఇక కష్టపడినన్నాళ్ళు కష్టపడక్కర్లేదన్నాడు.

బి. ఎ. పరీక్షలు యిక మూడు నెలలున్నాయి. సుబ్రహ్మణ్యానికి దగ్గు, జ్వరం యెక్కువైపోయింది. ఆస్పత్రికి తీసుకువెళ్ళి డాక్టరుకు చూపించాడు తండ్రిని విశ్వం. డాక్టరు పరీక్షచేసి టి. బి. అని తేల్చాడు. వెంటనే క్షయాసుపత్రికి తీసుకువెడితే బ్రతుకుతాడని చెప్పాడు. చేతిలో దమ్మిడీ లేదు. రేపు యెల్లాగడుస్తుందా కొని రోజులేని సంసారపరిస్థితిలో వైద్యం యేం చేయించడము? సుబ్రహ్మణ్యం వైద్యం వద్దన్నాడు. గోరంత ఆయుర్దాయముంటే యేం ఫరవాలేదన్నాడు. భగవంతుడే వున్నాడనుకున్నాడు.

కొద్ది రోజులకే మంచం పట్టాడు సుబ్రహ్మణ్యం. ఆనాటిరాత్రి పరిస్థితి చాలా విషమించింది విశ్వం, తల్లి కొయ్యబొమ్మల్లాగ నిలబడి వున్నారు. "మా నాన్నగారికి ప్రాణభయం లేదుకదా?" అన్నాడు విశ్వం. *About Half An hour More* (ఇక అరగంట) అన్నాడు నిరాశా సూచకంగా పెదవి విరుస్తూ డాక్టరు.

* * * *

"*Half anhour More*" అన్నాడు హాల్ సూపరింటెండెంటు. విశ్వం ఆయనమీద లోపల విసుక్కున్నాడు.

ఇంతవరకు విశ్వం ఒక్క అక్షరమైనా వ్రాయలేదు. ఈ అరగంటలోనైనా వ్రాస్తే కొన్ని మార్కులు పడవచ్చు అనుకుని తన చుట్టుప్రక్కల యిటూ అటూ చూశాడు. ప్రక్క విద్యార్థులు వంచినతల యెత్తకుండా వ్రాస్తూండడం గమనించాడు. తనూ వ్రాద్దామని నిశ్చయానికి వచ్చాడు.

ప్రశ్నపత్రంకేసి తీక్ష్ణంగా చూశాడు ఇటూ అటూ వ్రాస్తున్న విద్యార్థుల్ని చూశాడు. ప్రక్కవాడి పుస్తకంలోకి చూశాడు. "అర్థశాస్త్రానికీ, నైతిక ప్రవర్తనకీ గల సంబంధమును చర్చింపుము" అనే

ప్రశ్నకు "ఆర్థిక సౌష్ఠవం లేకపోవడంవల్ల నైతిక ప్రవర్తన కుంటుపడుతుంది" అనే వాక్యం జవాబుగా వ్రాస్తున్నాడా విద్యార్థి.

ఆ రెండుముక్కలూ కాపీ చేద్దామనుకున్నాడు. కలం ముందుకి రాలేదు.

"ఛీ" అనుకున్నాడు విశ్వం. తనలోని నైతిక ప్రవర్తన యింత తగ్గిపోవడము, తను కాపీ చెయ్యడానికి సిద్ధపడడమూ తనకు ఆర్థిక సౌష్ఠవం లేకపోవడంవల్లేకదా! అనుకున్నాడు. కాపీ చెయ్యాలన్న నీచమైన వూహ యింతవరకెన్నడు అతడెరుగడు. "నీతి, నియమం, ధర్మం, సత్యం, యివన్నీ వుండాలని చెప్పేవారంతా ఆర్థికంగా గొప్పవారే అయివుండాలి." అనుకున్నాడు విశ్వం.

డాక్టరు చెప్పినట్టే అరగంటకి చనిపోయాడు సుబ్రహ్మణ్యం భార్యనీ, కొడుకునీ దిక్కులేనివారిని చేసి. "మీ అమ్మ నాతోపాటు కష్టపడింది. నీతల్లిని జాగ్రత్తగా చూసుకో. నీచదువు పూర్తవడం చూడలేకపోయాను" అని విశ్వంతో కడసారిగా మాట్లాడాడు. జాలిగా కొడుకును చూస్తూ, రెండేరెండు కన్నీటి చుక్కలు రెండు కళ్ళనుండి చెంపలమీదికి జారాయి సుబ్రహ్మణ్యానికి.

* * * *

విశ్వం కళ్ళనుండి రెండు కన్నీటిచుక్కలు రాలి చాక రకపుసిరాతో తన ఆన్సరు బుక్కు మీద వేసిన రిజిష్టరు నెంబరు చెరిగిపోయింది.

ఆనాటికి తండ్రిపోయి సరిగా నెల అయింది. విశ్వం తల్లిని పోషించాలి. తను బ్రతకాలి. అందుచేత యీ పరీక్షలో నెగ్గితీరాలి.

తండ్రి తన అభివృద్ధికోసం యెంత కష్టపడ్డాడు. చివరకి ప్రాణంకూడా త్యాగం చేశాడు. తల్లి భర్త లేని దుఃఖంతో కుమిలిపోతోంది యింటిదగ్గర. విశ్వం కడుపులోంచి దుఃఖం ఉప్పెనలాగ పొంగివస్తోంది. తల వంచుకుని దుఃఖం అణచుకుందుకు ప్రయత్నం చేస్తున్నాడు. గంట కొట్టారు. విద్యార్థులవద్ద జవాబు పత్రాలు తీసుకుంటూ సూపరింటెండెంటు వచ్చాడు విశ్వం దగ్గరకి. విశ్వం తన బ్లాంక్ పేపరు ఆయనకిచ్చి బైటకు వెళ్ళిపోయాడు కాళ్ళీడ్చుకుంటూ. ★

